జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## నల్లగొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
మంగళవారం 12 మే 2026 పేజీలు : 14




## అక్రమంగా తరలిస్తున్న 52 గోవుల పట్టివేత

# పశువుల అక్రమ రవాణాపై
# కట్టుదిట్టమైన నిఘా..

**కోర్లపాడు టోల్ ప్లాజా చెక్ పోస్టును తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ..**

**ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి..**

**జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్**



**నల్గొండ మే 11 (ప్రజా జ్యోతి):**

బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సోమవారం కోర్లపాడు టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన ...మిగతా 2లో

## బొడ్డు బాలకృష్ణ కు నివాళులర్పించిన ఎమ్మెల్యే వేముల వీరేశం



**చిట్యాల మే 11 (ప్రజాజ్యోతి ప్రతినిధి):**

చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన బొడ్డు బాలకృష్ణ సంతాప సభకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరయ్యారు. ఈ నెల 1వ తేదీన న్యోష్ ల్యాబ్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో బాలకృష్ణ మృతి చెందగా సోమవారం ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు కాటం వెంకన్న, మండల పార్టీ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనరసింహ, గ్రామ సర్పంచ్ ఆవుల సుందర్, నాయకులు అందే రాములు అద్దెల లింగారెడ్డి స్థానిక నేతలు, పాల్గొన్నారు.

## మహిళా కమిషన్ మెంబర్‌గా కాసోజు శంకరమ్మ

**మోత్కూరు, మే 11 (ప్రజా జ్యోతి):**



మోత్కూరు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతచారి మాతృమూర్తి కాసోజు శంకరమ్మ ను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ గా నియామకం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా కమిషన్ చైర్మన్ గా గద్వాల విజయలక్ష్మిని నియామకం చేస్తూ ఆమెతో పాటు సభ్యులుగా ఏడుగురిని నియామకం చేశారు. అందులో కాసోజు శంకరమ్మ ఉన్నారు.

## ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యం

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల ఫిర్యాదుల స్వీకరణ..**

**నల్గొండ మే 11, (ప్రజా జ్యోతి):**

జిల్లా పోలీస్ గ్రీవెన్స్ డే లో సోమవారం ప్రజలనుండి వచ్చిన ఫిర్యాదులను, సమస్యలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులకు తక్షణ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ప్రజలకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి



పనిచేస్తుందని తెలిపారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి బాధితులకు సరైన న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని , ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా విచారించి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎస్పీ తెలిపారు.



## రిసోర్స్ పార్క్ , డంపింగ్ యార్డును పరిశీలించిన మున్సిపల్ కమిషనర్..

వార్త 2లో

# అక్రమంగా తరలిస్తున్న 52 గోవుల పట్టివేత



**చిట్యాల మే 11(ప్రజాజ్యోతి ప్రతినిధి):**

చిట్యాల రైల్వే స్టేషన్ ఎక్స్ రోడ్డు వద్ద అక్రమంగా 52 గోవులను తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు నార్కట్ పల్లి సిఐ కైగూరి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా, అనుమానాస్పదంగా వెళ్తున్న టీజీ 12 యూ 6043 నంబర్ గల లారీని ఆపి తనిఖీ చేయగా, ఉత్తరప్రదేశ్ కు చెందిన డ్రైవర్ మున్నా ఎటువంటి అనుమతులు లేకుండా 52 గోవులను హైదరాబాద్‌లోని గోవధశాలకు తరలిస్తున్నట్లు గుర్తించారు. పశువులను అత్యంత క్రూరంగా నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తుండటంతో,పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని గోవులను చింతపల్లిలోని గోశాలకు తరలించారు.ఈ ఘటనపై లారీ డ్రైవర్ మున్నా,సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్సై ఎం. రవికుమార్ తెలిపారు. నార్కట్ పల్లి ఎస్సై విష్ణు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా..

**కోర్లపాడు టోల్ ప్లాజా చెక్ పోస్టును తనిఖీ చేసినజిల్లా ఎస్పీ..**

**ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి..**

**జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్**

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని, ముఖ్యంగా కంటైనర్ లారీలు, లోడ్ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, పశువుల రవాణాకు అవసరమైన అనుమతులు, డ్రైవర్ల వివరాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా, సామర్థ్యానికి మించి పశువులను తరలించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. రవాణా చేసే వ్యక్తులు తప్పనిసరిగా కొనుగోలు రసీదులు, వెటర్నరీ వైద్యుల ధృవపత్రాలు కలిగి ఉండాలని, జంతు సంరక్షణ చట్టాలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని వాహనాలను అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని, అటువంటి సమాచారాన్ని వెంటనే డయల్ 100కు అందించాలని కోరారు. అలాగే సోషల్ మీడియాలో మత విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే ఐటీ చట్టం ప్రకారం కఠిన



చర్యలు తప్పవన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా సరిహద్దుల వద్ద 24 గంటల నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐ హరిబాబు, ఎస్సైలు సతీష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# రిసోర్స్ పార్క్,డంపింగ్ యార్డు ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్..

**మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం..**

**డంపింగ్ యార్డులో మంటలు చెలరేగకుండా చూడాలి..**

**వాటర్ ట్యాంకర్ల ద్వారా నిరంతరం నీటిని చల్లి పొగలు, మంటలను ఆర్పాలి..**

**కాలుష్య నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలి..**

**అధికారులకు ఉత్తర్వులు జారీ చేసిన.. మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర**

**నల్గొండ మే 11,(ప్రజా జ్యోతి) :**

వేసవి తీవ్రత దృష్ట్యా డంపింగ్ యార్డులో ఎట్టి పరిస్థితుల్లోనూ మంటలు, పొగలు రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర ఆదేశించారు. సోమవారం నల్లగొండ పట్టణ పరిధిలోని చందనపల్లి లో గల రిసోర్స్ పార్క్ డంపింగ్ యార్డు ను కమిషనర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డులో కొనసాగుతున్న బయోమైనింగ్ పనులు, అగ్ని ప్రమాద నివారణ చర్యలు, పొగ నియంత్రణ పరిస్థితులను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తీక్, అసిస్టెంట్ ఇంజనీర్ అసీమ్ బాబా, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎన్. ప్రదీప్ రెడ్డి, డంపింగ్ యార్డు ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ శశిధర్ తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న తీవ్ర ఎండలు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా డంపింగ్ యార్డులో మంటలు, పొగలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మంటలు చెలరేగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.వాటర్ ట్యాంకర్ల ద్వారా నిరంతరం నీటిని చల్లి పొగలు, మంటలను పూర్తిస్థాయిలో అదుపులో ఉంచాలని ఆదేశించారు. అలాగే ఇటీవల త్రవ్వించిన కొత్త బోర్‌వెల్‌కు తక్షణమే మోటార్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి నీటిని తీసుకుని డంపింగ్ యార్డులో వినియోగించాలనీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అసిస్టెంట్ ఇంజనీర్‌లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో ఎటువంటి అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని





సూచించారు.ఈ రిసోర్స్ పార్క్‌లో ప్రస్తుతం సుమారు 65 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉండగా, అందులో 14 వేల మెట్రిక్ టన్నుల బయోమైనింగ్ పనులు పురోగతిలో ఉన్నట్లు అధికారులు కమిషనర్ కి వివరించారు. బయోమైనింగ్ ఏజెన్సీ "రేకార్ట్" ప్రతినిధులకు పనులను మరింత వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. డంపింగ్ యార్డు పరిసర ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని, నగర పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని కమిషనర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బయోమైనింగ్ ఏజెన్సీ ప్రతినిధులు, మున్సిపల్ ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# లారీల కొరత తీర్చాలని తహ సిల్దార్ కు రైతులు వినతి పత్రం అందజేత

**నూతనకల్...మే 11 (ప్రజా జ్యోతి):**

మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఏర్పాటుచేసిన ధాన్యపు కొనుగోలు కేంద్రాలలో లారీల సప్లై లేక ధాన్యపు కాంటాలు ఆగిపోవడంతో రైతులు మండల తహసిల్దార్ శ్రీనివాసరావుకు తమ ఆవేదనను తెలియజేస్తూ సివిల్ సప్లై అధికారులతో మాట్లాడి వెంట వెంటనే లారీలు సప్లై అయ్యే విధంగా చూడాలని కోరుతూ సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లారీల సప్లై లేక ఎగుమతులు జరగక కాంటాలు అయినా దాన్యపు బస్తాలు నిలువ ఉండడంతో కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ధాన్యాన్ని కాంటాలు వేయడం నిలిపివేశారని,కాంటాలు ఎందుకు వేయడం లేదని అడిగితే లారీల కొరత ఉండడంతో కాంటాలు వేసిన బస్తాలు నిలువ ఉన్నాయని అందుకే కాంటాలు నిలిపివేసినట్లు వారు తెలిపారని అన్నారు.అకాల వర్షాలు పడినట్లయితే తమ ధాన్యపురాసులు నిలువ ఉన్న కాంటాలు వేయబడిన బస్తాలు తడిసి ముద్దయి మాకు అపార నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సివిల్ సప్లై అధికారులతో మాట్లాడి లారీల సప్లై నీ వేగవంతం చేసి ధాన్యపు కాంటాలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.రైతుల ఆవేదనము గమనించిన తహసిల్దార్ శ్రీనివాసరావు ఉన్నతాధికారులతో మాట్లాడి లారీలు సప్లై అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు వెంకట్ రెడ్డి,గంగారెడ్డి, మధుసూదన్ రెడ్డి,లింగారెడ్డి, జనార్ధన్ రెడ్డి,లింగయ్య, పుల్లారెడ్డి,మహేష్,సైదులు, రవిశేఖర్ రెడ్డి,చాంప్ల,సత్తిరెడ్డి, చంద్రారెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.



# తుమ్మలపల్లిలో చలి వేంద్రం ప్రారంభం




**నాంపల్లి,మే,11(ప్రజా జ్యోతి):**

మండలంలోని తుమ్మలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో స్థానిక పాలకవర్గం ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి చలివేంద్రం ఏర్పాటు చేశారు. పలు రకాల పనులకు వచ్చే ప్రజలకు చలివేంద్రం ఉపయోగకరమని అన్నారు. వేసవిలో ఎండల నుండి ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానికులు అన్నారు. ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అకిటి ప్రమీల మహేష్, ఉప సర్పంచ్ వెల్గపురి సుభద్ర రంగారావు, వార్డు సభ్యులు అన్నెపాక చిరంజీవి, బైకానీ సత్యనారాయణ, రెవల్లి యాదయ్య, వాదాసు యాదయ్య, సన్నాయిల మీనయ్య, మరియు గ్రామ పెద్దలు అన్నేపాక నాగరాజు, రత్నయ్య, సన్నాయిల రమేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మిత్రుని కుటుంబానికి స్నేహితుల ఆర్థిక చేయుత

## మానవత్వాన్ని చాటుకున్న 2006-07 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు



**చిట్యాల మే 11(ప్రజాజ్యోతి ప్రతినిధి):**

స్నేహం అంటే కేవలం కలిసి చదువుకోవడమే కాదు, కష్టంలో ఉన్న మిత్రుని కుటుంబానికి కొండంత అండగా నిలవడమని నిరూపించారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన సిలువేరు వెంకటేష్ ఇటీవల అకాల మరణం చెందారు. ఆయన హఠాన్మరణంతో ఆ కుటుంబంలో అలుముకున్న చీకట్లను చూసి చలించిన ఆయన తో కలిసి చదువుకున్న పదవ తరగతి 2006-07 బ్యాచ్ అండగా నిలిచారు. మిత్రులు తమ వంతు సహాయంగా యాభై ఆరు వేల రూపాయల నగదును మంగళవారం వెంకటేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. చిన్న వయసులోనే మిత్రుడు మరణించడం తీరని లోటని, వారి కుటుంబానికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని ఈ సందర్భంగా మిత్రబృందం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిత్రులు ఆవుల రాము యాదవ్, ఊట్కూరి రమేష్, మాచర్ల యాదగిరి, ఆవనగంటి ఆంజనేయులు, తోటకూర మహేష్, మైల వేణు, ఆవనగంటి గణేష్ తదితరులు పాల్గొన్నారు. చదువు పూర్తై దాదాపు 18 ఏళ్లు గడుస్తున్నా, నాటి మిత్రుని కష్టాన్ని చూసి స్పందించిన వీరి దాతృత్వాన్ని గ్రామస్తులు అభినందించారు.

# వారసత్వ భూమిపై అక్రమ పట్టా..

**వారసత్వ భూమిపై కన్నేసిన భూకబ్జాదారులు..!**

**లంచాలు తీసుకుని పట్టా మార్పిడి చేశారు".. మాజీ తహసీల్దార్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**కోదాడ టౌన్, మే 11 (ప్రజా జ్యోతి):**

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో వారసత్వంగా వస్తున్న భూమిని అక్రమంగా ఇతరుల పేర్లపై పట్టా చేశారంటూ రైతులు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా కోదాడ ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ప్లకార్డులతో నిరసన చేపట్టి తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.బాధిత రైతుల వివరాల ప్రకారం.. కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగాపురం రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్లు 615, 616లో సుమారు రెండు ఎకరాల భూమి తమ కుటుంబానికి వారసత్వంగా వస్తోందని తెలిపారు. అయితే గతంలో పనిచేసిన కొందరు తహసీల్దార్లు కాసులకు కక్కుర్తి పడి, అక్రమంగా ఇతరుల పేర్లపై పట్టా మార్పిడి చేశారని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా తమ కుటుంబం తీవ్రంగా నష్టపోయిందని వాపోయారు. ఈ సందర్భంగా రైతులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. భూమిపై జరిగిన పట్టా మార్పిడి వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులైన అధికారులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించిన రైతులు, లంచాలు తీసుకుని అక్రమ పట్టా మార్పిడికి పాల్పడిన తహసీల్దార్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. తమ భూమిని తిరిగి తమ పేర్లపై నమోదు చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వనపర్తి ఉపేంద్రనే వ్యక్తి తన భూమిని అన్యాయంగా ఎక్కించుకున్నాడు అని వాపోయారు. వారి వెంట సామాజిక కార్యకర్తలు కుదరవెల్లి బసవయ్య, పొడుగు హుస్సేన్, నాలం రాజన్న తదితరులు ఉన్నారు.



# ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు - మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి



**హాలియా,మే11(ప్రజా జ్యోతి)**

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి తెలిపారు.సోమవారం హాలియా పట్టణంలోని పేరూరు రోడ్డు,సాగర్ రోడ్డు,మున్సిపల్ కార్యాలయం ఎదుట మూడు చలివేంద్రాలను చైర్మన్ మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండల నేపథ్యంలో ప్రజల దాహార్తి బాధలు తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. స్వచ్ఛంద సంస్థలు,యువజన సంఘాలు,దాతలు పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్,కౌన్సిలర్ బొంగరాల యేసు రాజు,కౌన్సిలర్ సలహాదారులు నకిరేకంటి సైదులు,చిట్టిప్రోలు కరుణా సాగర్,మజహార్ మొయినుద్దీన్, ఎడవల్లి రంజిత్,కో ఆప్షన్ సభ్యులు ఎండి రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి.. ఆడబిడ్డల భవిష్యత్తుకు ప్రభుత్వ భరోసా

## కుటుంబాలకు ఊరట.. రూ.86.09 లక్షల చెక్కుల పంపిణీ



**కోదాడ టౌన్, మే 11 (ప్రజా జ్యోతి):**

పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి పేర్కొన్నారు. కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 86 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.86 లక్షల 9 వేల 976 రూపాయల విలువైన చెక్కులను ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రతి అర్హులైన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకాల ఉద్దేశమని వివరించారు.ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో అనేక కుటుంబాలు ఉపశమనం పొందుతున్నాయని లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ తహసిల్దార్ లు సంతోష్ కిరణ్, ధ్రువ కుమార్, హిమ బిందు, సోశీమపంగు సూరయ్య, సరిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**భువనగిరి మే 11(ప్రజా జ్యోతి న్యూస్)**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు. సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘనంగా ప్రారంభమయ్యాయని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో నూతన తరగతి గదులు, టాయిలెట్లు, వంటగదుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించడంతో పాటు విద్యార్థుల కోసం వేసవి శిబిరాలను ప్రారంభించారు. ఈ



సందర్భంగా పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ రాజాపేట పాఠశాలలో అదనపు తరగతి గదులు మరియు సైన్స్ ల్యాబ్‌ను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, విద్యాశాఖ మౌలిక వసతుల ఇంజనీరింగ్ విభాగం డి.ఈ. శివకుమార్, రాజాపేట మండల విద్యాధికారి చందా రమేష్ పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు,



కేజీబీవీ వలిగొండ, తుర్కపల్లి, బొమ్మలరామారం, పోచంపల్లి, భువనగిరి మండలాల్లో నాబార్డ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బాలురు, బాలికల టాయిలెట్లు, మూత్రశాలలు, వంటగదుల నిర్మాణ పనులు పలు పాఠశాలల్లో ప్రారంభమయ్యాయి. భువనగిరి మండలం ఆకుతోట బావి తండాలో నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగవర్ధన్ రెడ్డి, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్, గ్రామ సర్పంచ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తుర్కపల్లి మండలం బచ్చులిగూడ ప్రాథమిక పాఠశాలలో నూతన టాయిలెట్, వంటగది, చౌటుప్పల్ మండలం కుంట్లగూడెం ఉన్నత పాఠశాలలో వంటగది, నారాయణపురం మండలం గుజ్జ, కంకణాలగూడెం పాఠశాలలు, రామన్నపేట మండలం బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల, అడ్డగూడూరు మండలం రేపాక(డి) పాఠశాలలో టాయిలెట్లు, వంటగదులను ఆయా మండల విద్యాధికారులు, సర్పంచులు ప్రారంభించారు. జిల్లాలోని 17 పీఎం ఉన్నత పాఠశాలల్లో వేసవి శిబిరాలను ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, సెక్టోరియల్ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కోదాడలో ప్రభుత్వ భూములపై కబ్జాల దందా

**పెద్దల హస్తం ఉంది.. నేనేం చేయలేను" --- కమిషనర్ వ్యాఖ్యలపై ఆగ్రహం**

**ఆర్డీఓ కార్యాలయం ఎదుట కోదాడ పరిరక్షణ సమితి ఆందోళన.. కమిషనర్ సస్పెన్షన్‌కు డిమాండ్**

**కోదాడ టౌన్, మే 11 (ప్రజా జ్యోతి):**

సూర్యాపేట జిల్లా కోదాడ మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదంటూ కోదాడ పరిరక్షణ సమితి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భూకబ్జాల వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆర్డీఓ కార్యాలయం ఎదుట సమితి నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కోదాడ పరిరక్షణ సమితి నాయకుడు శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ..మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను కొందరు అక్రమంగా ఆక్రమించుకుంటున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భూకబ్జాల అంశంపై మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నిస్తే "కబ్జాల వెనుక పెద్దల హస్తం ఉంది.. నేను ఏమీ చేయలేను" అని సమాధానం చెప్పడం దారుణమని మండిపడ్డారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికారి చేతులెత్తేయడం సిగ్గుచేటని విమర్శించారు. విధి నిర్వహణలో పూర్తిగా విఫలమైన మున్సిపల్ కమిషనర్‌ను తక్షణమే సస్పెండ్ చేసి, ప్రభుత్వ భూములపై జరుగుతున్న కబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అక్రమ కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని కోరారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు



నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని కోదాడ పరిరక్షణ సమితి హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు పొడుగు హుస్సేన్, కుదరవెల్లి బసవయ్య, మాదాల ఉపేందర్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



## బండి సంజయ్ ను బర్తరఫ్ చేయాలి



**హాలియా,మే11(ప్రజా జ్యోతి)**

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేస్ నమోదైన తరుణంలో నైతిక బాధ్యతగా ఆయన తన పదవికి రాజీనామా చేయాలని లేకపోతే ప్రధాని మోదీ బండి సంజయ్ ను బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం హాలియా పట్టణంలో బాలిక వ్యక్తిత్వం పై దిగజారుడు వ్యాఖ్యలను ఖండిస్తూ బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేసి బండి సంజయ్ ని మంత్రి పదవి నుండి భర్త రఫ్ చేయాలని నిరసిస్తూ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు వడ్డే సతీష్ రెడ్డి,పిడిగం నాగయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కలూరు శ్రీనివాస్ రెడ్డి కౌన్సిలర్ కడమంచి ప్రమీల శ్రీను,మాజీ కౌన్సిలర్ అన్నేపాక శ్రీనివాస్,మాజీ కో ఆప్షన్ సభ్యుడు చాపల సైదులు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు కర్ణ నర్సిరెడ్డి, చిట్టిప్రోలు శ్రీనివాస్,పొదిల శ్రీనివాస్,సురభి రాంబాబు, సైదాచారి,కూరాకుల రవి తదితరులు పాల్గొన్నారు.

## పాదాచారులకు చల్లని మజ్జిగ పంపిణీ




**హాలియా,మే11(ప్రజా జ్యోతి)**

హాలియా క్లబ్ వారి ఆధ్వర్యంలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సోమవారం హాలియా పట్టణంలో పాదాచారులకు చల్లని మజ్జిగ రాగి జావా ను పంపిణీ చేశారు. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతూ ఉండడంతో మధ్యాహ్నం సమయంలో బయటకు రావడం ప్రజలకు కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో దారిన పోయే వారికి ఉపశమనం కలిగించేందుకు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. హాలియా క్లబ్ సభ్యులు స్వయంగా మజ్జిగను రాగి జావను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పొట్టుముత్తు వెంకటేష్,కుక్కడపు సంతోష్, బచ్చు వెంకన్న,పోలిశెట్టి మహేష్, బచ్చు సతీష్,సముద్రాల అరవింద్,తేలప్రోలు ఉదయ్,ఊరే వినోద్,నాగరాజు,బచ్చు విశ్వనాథ్, మహేష్,మంచుకొండ వెంకటేశ్వర్లు,ప్రభాకర్,పోలా సైదులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన తహసీల్దార్‌కు పద్మశాలి సంఘం సన్మానం



**కోదాడ టౌన్, మే 11 ( ప్రజా జ్యోతి):**

కోదాడ మండలానికి నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ సంతోష్ కిరణ్ కు పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు గౌర్రె రాజేష్ నేతృత్వంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా చేనేత వర్గాల వారికి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యాలయ పనుల నిమిత్తం ఎవరు వచ్చినా పారదర్శకంగా సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నేతలు నక్కా చంద్రం, పిండిప్రోలు శ్రీనివాస్, పంతంగి నరేష్, నక్క గోపి, కొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి విద్యార్థులే రేపటి నవభారత సారధులు

**కోదాడ టౌన్, మే 11 ( ప్రజా జ్యోతి):**

కోదాడఅంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం ( ఆస్క ), కోదాడ ఆధ్వర్యంలో నిర్వహించేలి ఉచిత పాలిటెక్నిక్, టీజీ ఆర్జెసి శిక్షణ ముగింపు సమావేశం స్థానిక ఎమ్మెస్ కళాశాల లో ఆస్క అధ్యక్షురాలు బల్గూరి స్నేహ దుర్గయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెస్ కళాశాలల అధినేత పందిరి నాగిరెడ్డి, ఇరిగేషన్ జేఈ బల్గూరి దుర్గయ్య, శ్రీనివాస్ రెడ్డి, కుడుముల స్వామిదాసు, వరహాలరెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పందిరి నాగిరెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఆస్క ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా అన్ని వర్గాల విద్యార్థులకు ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ అందించడం ఎంతో అభినందనీయం అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని, పాలిటెక్నిక్ లో మంచి కళాశాలలో సీటు సంపాదించి భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలని కోరారు. మీరు




ఉన్నత స్థానానికి చేరుకున్న తర్వాత పే బ్యాక్ టు సొసైటీ లో భాగంగా మీరు కూడా సమాజ సేవ చేయాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆస్క ప్రధాన కార్యదర్శి మాతంగి ప్రభాకర్ రావు, కోర్స్ డైరెక్టర్ గంధం బుచ్చారావు, బొడ్డు హుస్సేన్, అమరబోయిన వెంకటరత్నం, నందిపాటి సైదులు, మేళ్లచెరువు వీరభద్రం, చెరుకుపల్లి కిరణ్, కన్నయ్య, షరీఫ్,గిరి ప్రసాద్, శ్రీకాంత్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల కన్నీళ్లు ఆరాలంటే ప్రభుత్వం మేల్కొనాలి

## రైతు సమస్యలు పరిష్కరించకపోతే రోడ్డెక్కుతాం

## – మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి





**భూదాన్ పోచంపల్లి, మే 11( ప్రజాజ్యోతి):**

మండలంలోని రేవనపల్లి, గోస్కొండ, భీమనపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాల కోసం రోజుల తరబడి ఎదురుచూస్తున్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం, తూకం అక్రమాలు, లారీలు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలపై రైతులు తమ ఆవేదనను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తమ కష్టార్జిత పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కాంటా వేయకపోవడం దారుణమన్నారు. పగలు మండే ఎండల్లో, రాత్రిళ్లు చలిలో ధాన్యం రాశుల వద్ద రైతులు కాపలా కాస్తూ పడుతున్న ఇబ్బందులు హృదయ విదారకంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలకు దూరంగా కేంద్రాల వద్దే ఉండాల్సి వస్తోందని, మహిళలు, వృద్ధ రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. తూకం పేరిట 42 కిలోల బస్తాలుగా ధాన్యాన్ని కొలుస్తూ రైస్ మిల్లుల యాజమాన్యాలు రైతులను నిలువునా దోచుకుంటున్నాయని ఆరోపించారు. రైతుల చెమట చుక్కలను లాభాల కోసం మిల్లర్లు వాడుకుంటున్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాంటా, లారీ ఖర్చుల పేరుతో బస్తాకు అదనపు వసూళ్లు చేస్తూ రైతులపై మరింత భారం మోపుతున్నారని విమర్శించారు. సివిల్ సప్లై శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాలను సమర్థంగా పర్యవేక్షించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. సరిపడా లారీలు లేకపోవడం వల్ల ధాన్యం తరలింపు నిలిచిపోతోందని, దీంతో రైతులు రోజులు తరబడి కేంద్రాల వద్దే నిరీక్షించాల్సి వస్తోందన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయకపోతే బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి అవసరమైతే హైవే దిగ్బంధం కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రైతుల కష్టాలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మడుగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, రావుల శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సిలువేరు బాలనరసింహ, కౌన్సిలర్ బాత్క లింగస్వామి, నాయకులు బత్తుల శ్రీశైలం గౌడ్, నోముల మాధవరెడ్డి, పగిళ్ళ సుధాకర్ రెడ్డి, మునుకుంట్ల బాలచంద్రం గౌడ్, ఆర్ల వెంకటేష్, ఆర్ల లింగస్వామి, నక్కలా రాజిరెడ్డి, సీత శ్రవణ్, చింతకింది కిరణ్, ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో సేవల మెరుగుదలకు 'స్నేహ' శిక్షణ

## బాలల రక్షణ, సంక్షేమంపై అవగాహన కల్పించిన అధికారులు

**భూదాన్ పోచంపల్లి, మే 11 (ప్రజాజ్యోతి)**

మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం "స్నేహ" ప్రోగ్రాంపై వీఓఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థాయిలో బాలల రక్షణ, మహిళల సంక్షేమం, సామాజిక సమస్యలపై అవగాహన పెంపొందించేందుకు ఈ శిక్షణను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఏడీఆర్డీఓ జంగారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను గుర్తించి బాధితులకు తక్షణ సహాయం అందేలా వీఓఏలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో గ్రామస్థాయి సిబ్బంది కీలక పాత్ర పోషించాలని అన్నారు. శిక్షణలో భాగంగా మహిళలు, చిన్నారుల భద్రత, బాల్య వివాహాల నిరోధం, పాఠశాల విద్య ప్రాముఖ్యత, ఆరోగ్య పరిరక్షణ, కుటుంబ సంక్షేమ అంశాలపై అధికారుల ద్వారా అవగాహన కల్పించారు. గ్రామాల్లో సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని వెంటనే స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో.ఆర్.భాస్కర్ రావు, ఎంఈఓ ప్రభాకర్, ఎస్ఐ కె. భాస్కర్ రెడ్డి మెడికల్ ఆఫీసర్ శ్రీవాణి, సీడీపీఓ, ఏపీఎం, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు వేసవిలో ప్రత్యేక శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి - ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

**మిర్యాలగూడ, మే 11,( ప్రజాజ్యోతి )**

: విద్యార్థులు వేసవి సెలవుల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) కోరారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.విజయ కుమారి అధ్యక్షతన ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే బిఎల్ఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని వివిధ అంశాలలో ఆటలు,




కంప్యూటర్ సైన్స్,ప్రయోగాలు,యోగ తదితర విషయాల్లో శిక్షణ



పొంది భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు.మండల విద్యాధికారి ధర్మనాయక్ మాట్లాడుతూ ఈ వేసవి శిబిరాలను విద్యార్థులు ఉపయోగించుకొని అన్ని రంగాలలోసర్వతోముఖాభివృద్ధి సాధించాలని అన్నారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్తిలుకూరి సుధా బాలకృష్ణ, 34 వ వార్డ్ కౌన్సిలర్ స్వప్న సోమ సుందర్,మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్, ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య, కొర్ర కృష్ణ కాంత్,గాంధీ పార్క్ ప్రధానోపాధ్యాయులు కురువ, రాంరెడ్డి, మధు, సైదిరెడ్డి, లక్ష్మా, నాగరాణి, మాధవి, జ్యోతి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**హాలియా,మే11(ప్రజా జ్యోతి)**

విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనుముల మండల విద్యాధికారి ముచ్చర్ల సీనయ్య అన్నారు.సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా వారోత్సవాల లో భాగంగా వేసవి శిబిరాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు శిబిరాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు చెరుపల్లి ముత్యాలు, బొంగరాల యేసు రాజు,కౌన్సిలర్ సలహాదారులు నకిరేకంటి సైదులు,మజాహర్ మొహినుద్దీన్, చిట్టిప్రోలు కరుణాసాగర్,ఎడవల్లి రంజిత్,కో ఆప్షన్ సభ్యులు వర్కాల శేఖర్ రెడ్డి,ఎండి రషీద్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికను వేధించిన మంత్రి బండిసంజయ్ కుమారుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## -మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు డిమాండ్

మిర్యాలగూడ, మే 11, ( ప్రజా జ్యోతి ):కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగిరద్ ఒక మైనర్ బాలికను గత మూడు నెలలుగా వేధిస్తున్నాడనే ఆరోపణలు వెలుగులోకి రావడం రాష్ట్ర ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. సోమవారం స్థానికంగా మాట్లాడుతూ ఈ చర్యను మిర్యాలగూడ బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బాలిక తల్లిదండ్రులు స్వయంగా పిటిషన్ ఇచ్చే స్థాయికి పరిస్థితులు వెళ్లినా, ఇప్పటివరకు ప్రభుత్వం, పోలీసులు స్పందించకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. సామాన్య ప్రజలపై అయితే వెంటనే కేసులు నమోదు చేసే ప్రభుత్వం, అధికార పార్టీలకు సంబంధించిన వ్యక్తుల విషయంలో మాత్రం ఎందుకు మౌనం పాటిస్తోందనిప్రశ్నించారు. మహిళల భద్రత, బాలికల రక్షణ గురించి గొప్పలు చెప్పుకునే బిజెపి నాయకులు, ఇప్పుడు తమ కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక మైనర్ బాలికపై



వేధింపుల ఆరోపణలు రావడం చాలా తీవ్ర విషయమని, దీనిపై వెంటనే బండి భగిరద్ పై పోక్సో కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార అహంకారంతో ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మహిళలు, బాలికలపై దౌర్జన్యాలకు పాల్పడే వారికి రాజకీయ హోదాలు, కుటుంబ నేపథ్యాలు రక్షణ కవచంగా మారకూడదన్నారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు పార్టీ పక్షాన పోరాటం కొనసాగిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రజావాణి లో భువనగిరి మున్సిపాలిటీ అధికారుల డుమ్మ

**ఘుస్సా అయిన ఆర్డీఓ కృష్ణ రెడ్డి**

**అధికారులు ప్రజావాణి లో హాజరు కాకపోతే కఠిన చర్యలు తప్పవు**

భువనగిరి,మే 11 (ప్రజాజ్యోతి)ప్రజావాణిలో వచ్చిన దరఖా స్తులను



క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని రాజస్వం మండలాధికారి భువనగిరి అన్నారు.సోమవారం రోజు రాజస్వ,మండలాదధికారి భువనగిరి,సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో యం. క్రిష్ణా రెడ్డి, రాజస్వ మండల ఆధికారి,వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 14 అర్జీలను స్వీకరించారు.ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటిక ప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిం చాలన్నారు.అందులో రెవిన్యూ శాఖకి సంబదించి మొత్తం 14 అప్లికేషన్ లు వచ్చాయి, జరిగింది,రెవెన్యూ శాఖకి సంబందిచి 14,మండలా వారిగా వచ్చిన ఆలేరు -5, భువనగిరి -4 బీబీనగర్ -2,తుర్కపల్లి-1 మోటకొండూర్-1,భువనగిరి (మున్సిపల్ )-1,అప్లికేషన్ వచ్చాయని తెలియ జేశారు.ఈ సందర్భంగా ఆర్డీఓ




మాట్లాడుతు ప్రజల నుండి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కారం చేయాలనీ అధికారులను ఆదేశించారు.అదే విధంగా కేవలం రెవిన్యూ శాఖ నే కాకుండ,అన్ని శాఖల అధికారులు క్రమం తప్పకుండ గ్రీవెన్స్ లో హాజరు కావాలని అన్నారు. ఒకవేళ ఎవరైనా అలసత్వం వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ డి.ఎ.ఒ పి.రాధ మరియు వివిధ శాఖల డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

# రామాపురంలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

మేళ్లచెరువు మే 11 (ప్రజా జ్యోతి) : మండలంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ రామాపురంలో మండల విద్యాధికారి ఫాతిమా బేగం సమ్మర్ క్యాంపును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాంప్‌లో నాలుగు అంశాలకు సంబంధించిన వివిధ ఆక్టివిటీలలో విద్యార్థులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పీఎం శ్రీ రామాపురం విద్యార్థులతో పాటు ఇతర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ఈ శిక్షణలో చేరవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మే 11 నుంచి మే 25 వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సమ్మర్ క్యాంప్ కొనసాగుతుందని తెలిపారు. క్యాంప్‌కు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్ కూడా అందించనున్నట్లు వెల్లడించారు.



# పది ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ శిబిరం

**మేళ్లచెరువు, మే 11 (ప్రజా జ్యోతి) :**



పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని మే 12 నుంచి నిర్వహించనున్నట్లు మేళ్లచెరువు ఎంఈఓ ఫాతిమా బేగం తెలిపారు. చింతలపాలెం, మేళ్లచెరువు, హుజూర్‌నగర్, గరిడేపల్లి, మఠంపల్లి, పాలకీడు, నేరేడుచర్ల మండలాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం మే 12 నుంచి జూన్ 3 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు సంబంధిత పాఠశాలల సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా బోధన అందించనున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహించబడతాయని వెల్లడించారు.

# బండి సాయి భగీరదను వెంటనే అరెస్ట్ చేయాలి

**బండి సంజయ్ ని మంత్రి పదవి నుండి తొలగించాలి**

**కిష్ట పాటి అంజిరెడ్డి**

**పాలకవీడు, ఏప్రిల్ 11(ప్రజా జ్యోతి ):**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు సాయి భగీరథ పై వెంటనే పోక్సో కేసు నమోదు చేసి , కోర్టులో హాజరు పరచాలని పాలకీడు మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విడుదల చేసిన పత్రికా ప్రకటన ఆయన మాట్లాడుతూ



ఒక మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి లోబరుచుకొని జీవితాన్ని నాశనం చేసి ,తనకు దూరంగా బతుకుతున్న బాలికతోబాటు , కుటుంబాన్ని కూడా బెదిరిస్తున్న బండి సంజయ్ కొడుకు పై 48 గంటలు దాటినా ఎఫ్ ఐ ఆర్ నమోదు కాకపోవడం పోలీస్ వ్యవస్థలో తన ప్రభావం ఎంత ఉందో స్పష్టం అవుతుందని మండిపడ్డారు.రాష్ట్ర ముఖ్యమంత్రి బాధిత బాలిక వైపు కాకుండా సంజయ్ వైపు ఉండటం బాధాకరం అన్నారు. అంతా చేసి బీసీ కార్డు వాడుకుని కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని,బాధితురాలు కూడా బీసీ కుటుంబం నుంచే వచ్చిందని పేర్కొన్నారు. నిందితుడ్ని అరెస్టు చేసేదాకా బాధితురాలి పక్షాన బి ఆర్ ఎస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు.

తన రాజకీయ పలుకుబడితో కేసును ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్న బండి సంజయ్ పై కూడా కేసు నమోదు చేయాలని బషీరాబాద్ పోలీసులను అంజిరెడ్డి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని బెదిరింపులకు గురిచేస్తున్నారని,కేసు వాపస్ తీసుకోకపోతే నా అనుచరులు ఏదైనా చేస్తారని భయబ్రాంతులకు గురి చేస్తున్నారని,అయినా కుటుంబం ధైర్యంగా నిలబడిందని వివరించారు. , కేసును ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్న మాజీ జర్నలిస్టు ,ప్రస్తుత బీజేపీ అధికార ప్రతినిధి సంగప్పను కూడా నిందితుల లిస్టులో చేర్చాలని కోరారు.

మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

బండి సంజయ్ మంత్రి పదవి లో ఉంటే కేసు విచారణ నిష్పక్షపాతంగా జరగదని, కాబట్టి వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని,లేదంటే అధిష్టానమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.పోలీసుల వైఖరి బాధాకరమని మండిపడ్డారు... బాధితురాలికి హాని కలిగితే , రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,బండి సంజయ్ పూర్తిగా బాధ్యత వహించాలని హెచ్చరించారు.

బాలికపై హనీ ట్రాప్ బురద మైనర్ బాలికపై హనీ ట్రాప్ బురద చల్లడం సిగ్గు మాలిన చర్య అని దుయ్యబట్టారు. బాధితరాలకు న్యాయం జరిగేవరకు బి ఆర్ ఎస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు.

# న్యాయస్థాన సమస్యలను పరిష్కరిస్తా -మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హుజూర్ నగర్, మే 11 (ప్రజా జ్యోతి): హుజూర్ నగర్ న్యాయస్థానాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి న్యాయవాదులకు హామీ ఇచ్చారు. హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గెలుపొందిన తర్వాత మొదటిసారిగా ఆ సంస్థ అధ్యక్షుడు నారపరాజు శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సాముల రామిరెడ్డి, సీనియర్ న్యాయవాది కుక్కడపు బాలకృష్ణ లతో కలిసి మంత్రిని మర్యాదపూర్వకంగా తన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అధునాతన సౌకర్యాలతో న్యాయస్థాన భవన సముదాయము, న్యాయమూర్తుల గృహ సముదాయాల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. న్యాయస్థానాల్లో ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధ్యక్షులు నారపురాజు శ్రీనివాసరావు ను



మంత్రి కోరారు. తమ సమస్యలపై స్పందించిన మంత్రికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బార్ కౌన్సిల్ సభ్యులు న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు.

# బుద్ధవనం సందర్శించిన తెలంగాణ టూరిజం చైర్మన్

## బుద్ధవనాన్ని మరొక తిరుపతిలా అభివృద్ధి చేస్తాం – టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**నాగార్జునసాగర్ మే 11 ప్రజా జ్యోతి**



అంతర్జాతీయ ప్రమాణాలతో నాగార్జున సాగర్ లో తెలంగాణ టూరిజం నిర్మించిన బుద్ధవనాన్ని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి కుటుంబ సమేతంగా సందర్శించారు. నాగార్జునసాగర్ సందర్శనలో భాగంగా బుద్ధవనం చేరుకున్న వీరికి



బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన,ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బుద్ధ చరిత వనంలో బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి వందనం చేశారు.బుద్ధచరితవనంలో గౌతమ బుద్ధుని జీవితములోని ముఖ్య ఘట్టాలను వీక్షించారు,అనంతరం మహాస్తూపం అంతర్భాగంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను తెలియజేసే లఘు చిత్రాన్ని వీక్షించారు.వీరికి బుద్ధవనం ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర బుద్ధవనం నిర్మాణ వివరాలను,విశేషాలను వివరించారు.అటు తర్వాత మహాస్థూపంలోని ధ్యాన మందిరం లో బుద్ధ జ్యోతులను వెలిగించిన అనంత రం కొద్దిసేపు ధ్యానం చేశారు.వీరిని బుద్ధవనం కండువాలతో,బ్రోచర్లతో సత్కరించారు.ఈ సందర్భంగా చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునే విధంగా మరో తిరుపతిలా బుద్ధవనాని అభివృద్ధి చేస్తామన్నారు,బుద్ధ వనం సందర్శన గొప్ప అనుభూతిని ఇచ్చిందని,బుద్ధుని బోధనలు మతాలకు అతీతంగా అందరూ స్ఫూర్తిగా తీసుకొని జీవితాన్ని ప్రశాంతంగా సుఖమయం చేసుకోవాలని పిలుపునిచ్చారు ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలతో భవిష్యత్తులో బుద్ధవనాని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.స్వదేశీ దర్శన్ లో భాగముగా బుద్ధవనం చుట్టుపక్కల ప్రదేశాలను అభివృద్ధి పరచడానికి సుమారు 500 కోట్ల రూపాయలతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని అది మంజూరు అయితే బుద్ధవనం మరింతగా అభివృద్ధి అవుతుందని అన్నారు.నాగార్జునసాగర్ లోని చాకలి గట్టును అభివృద్ధి చేస్తామని, హౌస్ బోట్లను ఏర్పాటుకు ప్రతిపాదించామ న్నారు,దేశంలోనే డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రముగా బుద్ధవనాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు,నాగార్జునసాగర్ లో 20 నుండి 30 మంది టూరిస్టులు ప్రయాణించేలా అన్ని సౌకర్యాలతో బోట్లను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లుగా ఆయన తెలిపారు, వీరితోపాటు బుద్ధవనం డి ఇ శ్రీనివాసరెడ్డి, విజయ విహార్ మేనేజర్ కిరణ్,సిద్ధార్థ హోటల్ నిర్వాహకులు వీరారెడ్డి,స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాల వేడుకలు

**హుజూర్ నగర్, మే 11 (ప్రజా జ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి 99 రోజుల "ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి మే 17 వరకు చేపట్టిన విద్యా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా హుజూర్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ రామారావు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం కళాశాల కరపత్రాలను బ్యానర్ ని విడుదల చేసి విద్యా వారోత్సవాల వేడుకలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రామారావు మాట్లాడుతూ సౌరవ్ డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాదు వారితో కళాశాల ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా కళాశాల విద్యార్థులకు అగ్రి, సర్వే, ఫిక్స్డ్ వింగ్ అంశాలలో డ్రోన్స్ ఆపరేటర్స్ గా ట్రైనింగ్ ఇవ్వడం, డ్రోన్ ఆపరేటర్ గా ఉద్యోగం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల బృందం వైస్ ప్రిన్సిపల్ ఎస్ఎస్ సునంద, ఐక్య సి కోఆర్డినేటర్ ఎస్ ప్రియాంక, బీ శ్రీనివాస్, ఎస్ బాలరాజు, డాక్టర్ నాగేష్, బి నాగార్జున, డాక్టర్ జే వెంకటేశ్వర్లు, వి .లక్ష్మీనారాయణ, మాలతి మట్టయ్య, ప్రవీణ్, యోగి, రాధా, స్రవంతి, సైదా నాయక్ పాల్గొన్నారు.




# సహజ వనరులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది... - ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

**మిర్యాలగూడ, మే 11,( ప్రజాజ్యోతి ):**

ప్రకృతి ఇచ్చిన వరం సహజ వనరులని, వాటిని కాపాడి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) కోరారు. సోమవారంజిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోజల సంచాయ్ – జన్ భాగీదారి (జె ఎస్ జె బి ) ప్రచార కార్యక్రమాన్ని డి ఆర్ డి ఓ వై.శేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ లతో కలిసి జెండా ఊపి ప్రారంభిం చారు. అనంతరం పోస్టర్స్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో రోజురోజుకీ భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయన్నారు . భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉన్నది. సహజ వనరులైన నీరు,భూమి, గాలిని కాపాడుకొని రాబోయే తరాలకి మంచి నీటిని అందించాల్సిన బాధ్యత మన అందరి మీద ఉన్నది.ఈ పథకంలో ఉన్నటువంటి అన్ని రకాల పనులను ఉపయోగించుకోవాలని కోరడం జరిగింది.డిఆర్డిఓ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ జె ఎస్ జె బి కార్యక్రమంలో గత సంవత్సరం లో మన జిల్లా జాతీయస్థాయిలో అవార్డు సాధించడం జరిగిందని,ఇట్టి అవార్డును భారత రాష్ట్రపతి చేత అప్పటి కలెక్టర్ అందుకోవడం జరిగిందన్నారు .ఈ సంవత్సరం కూడా నీటి వనరులను రక్షించి మనం జాతీయస్థాయిలో అవార్డు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఇట్టి కార్యక్రమానికి సంబంధించి కేటగిరి 1 కింద మ్యాజిక్ సోక్ పిట్స్, కమ్యూనిటీ సోక్ పిట్స్, బోర్ వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్స్, రూఫ్ టాప్ స్ట్రక్చర్స్, పాత బావులలో పూడికతీత పనులు,కేటగిరి 2 కింద సమతల కందకాలు(సీసీటీ), ఖండిత కందకాలు (ఎస్ జి టీ ),మట్టి కట్టలు, లూజ్ బౌలర్ స్ట్రక్చర్స్ , చెక్ డ్యాముల పూడికతీత మరియు నిర్మాణం,ఊట కుంట, ఫారం పాంట్స్, చాపల కుంట, చెరువులో పూడికతీత ఇలాంటి పనులనుఉపయోగించుకొని మరియు నిర్మించుకొని గ్రామీణ ప్రాంతాలలో భూగర్భ జలాలను పెంపొందించి రాబోయే తరాలకు మంచి నీటిని మరియు పంటలు పండడానికి అవసరమైన నీటిని పెంపొందించాలని కోరారు.సాంస్కృతిక సారధి నల్గొండ జిల్లా మల్లికా,శ్రీనివాస్ బృందం ద్వారా మిర్యాలగూడ మరియు సాగర్ నియోజకవర్గాలలోని అన్ని మండలాలు మరియు గ్రామ పంచాయతీలలో ప్రచార రథం తో పాటు కళాకారుల బృందం చే నీటి సంరక్షణ పనులపై పాటలు పాడుతూ ప్రజల కు అవగాహన కల్పించడం జరుగుతుంది అని మిర్యాలగూడ క్లస్టర్ ఏపీ డి ఎన్. బాలకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ, అడవిదేవులపల్లి, మాడుగుల పల్లి ఎంపీడీవో లు శేషగిరి శర్మ, మోసిన్ అలీ, డిపిఎం శ్రీనివాస్, ఏపీవో లు సూరనాయక్, ఎన్ శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్,శ్యామల, ఇ సి లు కళావతి, బాలు,నరసింహ చారి, భాగ్యలక్ష్మి ప్లాంటేషన్ సూపర్వైజర్ కృష్ణమూర్తి, దిలీప్,ఈజీఎస్ మరియు ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.







# యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### వారం రోజుల్లో సభ్యత్వ నమోదు పూర్తి అయ్యేలా కృషి చేయాలి

### నియోజకవర్గాల సభ్యత్వ పుస్తకాల అందజేత

### టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి

**నాగార్జునసాగర్ మే 11 ప్రజా జ్యోతి**

జర్నలిస్టుల హక్కుల రక్షణ కోసం యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాగార్జున సాగర్ నియోజకవర్గానికి సంబంధించిన సభ్యత్వ నమోదు పుస్తకాలను జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కి అందజేశారు.ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులంద రినీ ఏకం చేస్తూ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.వారం రోజుల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేసి నివేదికలు అందించాలని కోరారు.అలాగే త్వరలోనే జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్న ట్లు తెలిపారు,అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు అందేలా చూడటంతో పాటు,హెల్త్ కార్డులు,ఇంటి స్థలాలు మరియు ఇళ్ల మంజూరు కోసం యూనియన్ నిరంతరం పోరాడుతుం దని ఆయన స్పష్టం చేశారు.సమస్యల పరిష్కారంలో టీయూడబ్ల్యూజే ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమం కోసం యూనియన్ అండగా ఉంటుందన్నారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ,గడువులోగా సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.సభ్యత్వ నమోదులో



ఎటువంటి పొరపాట్లు లేకుండా పట్టణ సభ్యులు నరసింహ,రాజు,ప్రకాష్,అప్పారావు,తో కలిసి పకడ్బందీగా నిర్వహిస్తా మని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో చెరుకు సతీష్,రేపాల సతీష్,కందగట్ల శ్రీధర్,తదితరులు పాల్గొన్నారు.

# పాలకవీడు కేజీబీవీ నందు నూతన పనులకు శంకుస్థాపన

పాలకవీడు, ఏప్రిల్ 11(ప్రజా జ్యోతి ):

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే నెల 10 నుంచి 17వ తేదీ వరకు విద్యా వారోత్సవాలను నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలలో భాగంగా సోమవారం పాలకవీడు మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల విద్యాలయం



నందు రాష్ట్ర మంత్రివర్యులు నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో 87 లక్షల రూపాయల నాబార్డ్ నిధులతో కేజీబీవీ రక్షణ గోడ, ఇతర మౌలిక సదుపాయాలకు పాలకవీడు మండల సర్పంచ్ పల్లి సుజాత కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన పనులను ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్ వి సుబ్బారావు,డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి మోతిలాల్, మాజీ ఎంపీపీ గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నరసింహారావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఈ సుజాత,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

## ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి

### రూ. 33 లక్షల పిఎం శ్రీ నిధులతో సైన్స్ ల్యాబ్, లైబ్రరీ ప్రారంభం

### కాపుగల్లు హైస్కూల్‌లో ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమం





**కోదాడ రూరల్, మే 11 (ప్రజాజ్యోతి):**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించి, వారిని అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే ధ్యేయమని కోదాడ శాసనసభ్యురాలు నలమాద పద్మావతి రెడ్డి అన్నారు.సోమవారం కోదాడ మండలం కాపుగల్లు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పీఎం శ్రీ పథకం కింద మంజూరైన రూ. 33 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్ మరియు గ్రంథాలయాన్ని ఆమె రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.?ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సైన్స్ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అందుతుందని, లైబ్రరీ ద్వారా పఠనాశక్తి పెరిగి పోటీ పరీక్షల్లో రాణించడానికి దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు. నిధుల వినియోగంలో నాణ్యత పాటించి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించిన అధికారులను, పాఠశాల యాజమాన్యాన్ని ఆమె అభినందించారు.నూతన భవనంలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లోని పరికరాలను ఆమె పరిశీలించి, వాటి పనితీరు గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.?ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, కాపుగల్లు సర్పంచ్ దొంతగాని అప్పారావు, మాజీ సర్పంచ్ తొండపు సతీష్, జిల్లా విద్యాశాఖాధికారి అశోక్,ఎంఈఓ సలీం షరీఫ్, పిఎసిఎస్ చైర్మన్ నంబూరి సూర్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యా కమిటీ సభ్యులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాగర్ సురికి వీరాంజనేయ స్వామి జయంతోత్సవం

## మే 12న విశేష పూజలు

**నాగార్జునసాగర్,మే11 ప్రజా జ్యోతి**

నాగార్జునసాగర్ పైలాన్ కాలనీ లోని సురికి శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవాలయములో జయంతోత్సవాలు మంగళవారం అత్యంత వైభవోపేతంగా జరగనున్నాయి అని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ పరాభవ నామ సంవత్సర వైశాఖ బహుళ దశమి రోజున హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.ఆలయ అర్చకులు శంకర్ శర్మ మాట్లాడుతూ ఉదయం



ఐదున్నర గంటలకు పుణ్యాహవచనం,ఉదయం ఆరు గంటలకు పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు.ఉదయం ఏడు గంటలకు తమలపాకులతో సింధూర అర్చన,ఉదయం ఎనిమిదిన్నర గంటలకు గోత్రనామార్చన జరుగుతుంది.ఉదయం తొమ్మిది గంటలకు మంగళహారతి,మంత్రపుష్పం తరువాత తొమ్మిదిన్నర గంటలకు తీర్థప్రసాద వితరణ ఉంటుంది.భక్తులందరికీ మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నారు.భక్తులందరూ విచ్చేసి స్వామి వారి సేవలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ కమిటీ సభ్యులు కోరారు,ఆలయ కమిటీ సభ్యులు అంకయ్య,దాసు,వెంకటేశ్వర్ రెడ్డి , పోచంభట్ల శంకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



# బండి భగీరథను అరెస్టు చేయాలి..

## కళ్ళకు నల్ల బ్యాడ్జీలతో మహిళా నేత నిరసన

,రాజాపేట. మే 11(ప్రజా జ్యోతి ) రాజాపేట మండల కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని బి ఆర్ ఎస్ మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి,మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ డిమాండ్ చేశారు. సోమవారం రాజపేటలో మాట్లాడుతూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని జ6 మాజీ రిపోర్టర్ ప్రస్తుత బీజేపీ నాయకులు సంగప్ప ను కుడా అరెస్టు చేసి అమ్మాయికి తగిన న్యాయం చేయాలన్నారు.బండి సంజయ్ రోజు ధర్మం న్యాయం కోసం గొంతు చించుకొని మాట్లాడుతారు కదా బాలిక విషయంలో మీ ధర్మం ఎటు పోయిందన్నారు. మీరు ధర్మం వైపు నిలబడతారా? లేక అధర్మం వైపు నిలబడతారా? అనీ దేశ ప్రజలందరూ వేచి చూస్తున్నారన్నారు.దేశంలో మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత నీపై లేదా అని ప్రశ్నించారు.ఇట్టి వ్యవహారంపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నోరు మెదపకపోవడంపై ఆశ్చర్యం వేస్తా ఉందన్నారు. తెల్లారి లేస్తే కేసీఆర్ ఫ్యామిలీ గురించి మాట్లాడే కాంగ్రెస్ నాయకులారా బండి సంజయ్ కుమారుడు చేసిన ఈ బాగోతం మీ కంటికి కనిపిస్తలేదా మీరు ఎందుకు మాట్లాడలేకపోతున్నారన్నారు. వెంబడే బండి సంజయ్ మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్ర గోకుల జస్వంత్, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, బెడిద వీరేశం, మర్ల నాగరాజు, బొంగోని ఉప్పలయ్య గౌడ్, దగ్గుల విష్ణు, అంకతి నరసయ్య, గంధమల సురేష్ పాల్గొన్నారు.



# గుర్తు తెలియని వ్యక్తుల చే రాజాపేట గడ్డి వాము దగ్ధము..

**రాజాపేట, మే 11(ప్రజా జ్యోతి )**

రాజాపేట మండలం బొందుగుల గ్రామంలో ఇద్దరూ రైతులకు సంబంధించిన 15 ఎకరాల స్థలంలోని గడ్డి, విద్యుత్తు వైర్ మెటీరియల్ దగ్ధమైంది. సోమవారం జరిగిన సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్టు బాధిత రైతులు మర్ల రమేష్, మర్ల అనిల్ తెలిపారు.



# చెరువులో మట్టి అక్రమ తరలింపు కోసం సర్పంచ్ ఉప సర్పంచ్ యత్నం

**రాజాపేట, మే 11 (ప్రజా జ్యోతి**

)రాజాపేట మండలం దూది వెంకటాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని చెరువులోని మట్టిని ఇటుక బట్టి లకు అక్రమంగా తరలించేందుకు సర్పంచి ఉపసర్పంచి ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామస్తులు రైతులు సోమవారం గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. చెరువులో మట్టి తరలించొద్దని గ్రామ సభలో చేసిన తీర్మానాన్ని ధిక్కరిస్తూ సర్పంచ్ ఉప సర్పంచ్ లు నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఫిర్యాదులో ఆరోపించారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్ ని నో రాబోతుంది... డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పట్టించుకోండి కరువుతో మునుగోడు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు

# మూసికి కొత్తగూడెం వద్ద లిఫ్ట్ పెడితే కొంత ఉపశమనం వస్తుంది కదా


**ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ని డిమాండ్ చేస్తున్న సిపిఎం నేతలు**

**సంస్థాన్ నారాయణపురం,**

మే 11, (ప్రజాజ్యోతి) : ఈ సంవత్సరం ఎల్నినో రాబోతుందని శాస్త్రవేత్తలు ప్రకటిస్తున్నందున మునుగోడు ప్రజలు సాగు తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని సిపిఎం నేతలు నిలదీశారు. దశాబ్దాల తరబడి సాగదీస్తున్న డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని ప్రశ్నించారు. సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గుంటూజు శ్రీనివాస చారి మాట్లాడుతూ నియోజకవర్గంలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడబోతున్నాయని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారని గుర్తు చేశారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ కు అధికారులు అనేక అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఏదుల వద్ద డిండి కాల్వకు, వట్టెం రిజర్వాయర్ కు వెళ్లే నీటి ని సమాన ఎత్తులో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిని పూర్తి చేయడానికి అధికారులు, ప్రభుత్వం తీవ్ర కాలయాపన చేస్తున్నదన్నారు. ఈ కాలయాపనతో మునుగోడు ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని స్పష్టం చేశారు.

కొత్తగూడెం వద్ద మూసికి లిఫ్ట్ పెట్టాలి

డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయడానికి కాలయాపన జరుగుతున్నందున తాత్కాలికంగా రెండు మండలాలకు కొంత ఉపశమనం లభించే లాగా మూసి పై కొత్తగూడెం వద్ద నీటిని శుద్ధి చేసి లిఫ్ట్ ద్వారా తరలించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాగోల్ వద్ద నేటి శుద్ధి చేసి 16 కిలోమీటర్ల దూరం సిటీకి తరలించాలని చూస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుందన్నారు. కొత్తగూడెం వద్ద అలాంటి ఏర్పాటు జరిగితే చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాలలోని కొన్ని గ్రామాలకు నీటిని తరలించే అవకాశం లభిస్తుందన్నారు. దిండి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి అయ్యేవరకు అయినా ఈ రెండు మండలాలలో ప్రజలకు కొంత ఉపశమనం లభిస్తుందని సిపిఎం నేతలు స్పష్టం చేస్తున్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసే ఈ లిఫ్ట్ ను మంజూరు చేస్తే మూడు నెలల్లో పూర్తి చేయవచ్చునని ఇంజనీరింగ్ ని పనులు స్పష్టం చేస్తున్నారని సిపిఎం నేతలు గుర్తు చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నేతలు సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, దోనూరు నర్సిరెడ్డి, మల్లేపల్లి లలిత, దొంతగాని పెద్దలు, మండల కార్యదర్శి యాదిరెడ్డి, నాయకులు చింతకాయల నరసింహ, కొమ్ము మల్లేశం, పిట్ట రాములు, జనిగల నరసింహ, ఐతరాజు గాలయ్య తదితరులు పాల్గొన్నారు.



# రాజపేటలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్లే బీర్ల ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు

**రాజాపేట, మే 11 (ప్రజా జ్యోతి )**

రాజపేట మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మొదటగా మండల కేంద్రంలోని పురాతన శివాలయాన్ని సందర్శించిన బీర్ల అయిలయ్య అక్కడ నిర్మించనున్న ఫంక్షన్ హాల్‌కు భూమి పూజ నిర్వహించారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా అన్ని వసతులతో ఈ ఫంక్షన్ హాల్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అనంతరం పుట్ట హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ఆలయ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆలయాల భద్రత, పరిశుభ్రత, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగానే ఈ పనులు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య , విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ల్యాబ్ భవనం,అదనపు గదిని ప్రారంభించారు. విజ్ఞాన ఆధారిత విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని నిర్మించిన అదనపు పాఠశాల భవనాన్ని ప్రారంభించి విద్యార్థులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసంపై ఆరా తీశారు. అనంతరం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత సమ్మర్ క్యాప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేసవి కాలంలో ఎండ తీవ్రత నుంచి రక్షణ కల్పించేందుకు విద్యార్థులు, యువత, ప్రజలకు ఈ సమ్మర్ క్యాప్‌లు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ బీర్ల అయిలయ్య రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, విద్యా రంగ అభివృద్ధి, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ భాస్కరరావు, డీఈవో కందుల సత్యనారాయణ, సర్పంచి కోయ మధు, ఎంపీడీవో నాగవేణి, ఎంఈఓ చందా రమేష్, క్యాంప్ ఇంచార్జి తడ్కరాజు, ఉపసర్పంచి నమిల కేదారి గౌడ్, అభయాంజనేయ స్వామి దేవాలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ, రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్, రాజపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐరేని నవీన్ కుమార్, మాజీ అధ్యక్షులు బీర్రు లవన్, మాడోత్ విఠల్ నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, ఉపాధ్యాయులు, ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను చేనేత శాలువాతో సత్కరించారు





# బిక్కుమల్ల గ్రామపంచాయతీ పరిశీలన..



**నూతనకల్... మే 11 (ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని బిక్కుమల్ల గ్రామపంచాయతీని మండల అభివృద్ధి అధికారి సునీత సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఈజీఎస్,ఫీచర్ ఛానల్,నర్సరీ పనులను, గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో మగ్గాలు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్న 40 మంది కుటుంబాలకు సామాజిక మరుగుదొడ్లు కావాలని ఇటీవల పిడి డిఆర్డిఓ కి వినతిపత్రం ఇచ్చినందున వారిని పరిశీలించి తదుపరి చర్యలకు నివేదికలను ఉన్నతాధి కారులకు సమర్పించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామసహాయం మమత అనుపమ్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి ఆకుల ఉమేష్, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తా .. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ఆలేరు, మే 11 (ప్రజా జ్యోతి) :**

జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామంలో ఆలేరు జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల ఆరోగ్యంతో పాటు వారి కుటుంబాల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని, అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకుని వారి రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే కుటుంబ భద్రత కోసం బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీమా సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. అనంతరం జర్నలిస్టులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎం ఏ ఏజాజ్, మండల అధ్యక్షులు కంద్రాజ్ వెంకటేశ్వర్లు రాజు,



మాజి ఎంపీపీ అశోక్, పాత్రికేయులు ఎర్ర జాన్సన్, ఎండీ కుర్షిద్ పాషా, మాధవరెడ్డి, జుకంటి అనిల్ మొరిగాడి మహేష్,తోట మల్లయ్య, హనుమకొండ ఉపేంద్రాచారి,దాసి శంకర్,కుళ్ళ సిద్దులు, అరె భాను ప్రసాద్, కోరుటూరి ఉపేందర్, గుండు మహేందర్,మధు, జానకి రామ్, చింతకింది వెంకటేష్, చిరిగిరి స్వామి, వంగరి శివ కుమార్, ఆరే సాయికుమార్, బోడ నరేష్, జూల శ్రీధర్, దడిగె రమేష్, జహంగీర్, యెలుగాల కుమారస్వామి,శ్రీనివాస్, సంపత్,శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన వారిని వెంటనే శిక్షించాలి

## బూరుగడ్డ మాజీ సర్పంచ్ సలీమా రంజాన్

**హుజూర్ నగర్ మే 11 (ప్రజా జ్యోతి)**

మైనర్ బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన వారిని వెంటనే శిక్షించాలనీ బూరుగడ్డ మాజీ సర్పంచ్ సలీమా రంజాన్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని బూరుగడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో మాజీ సర్పంచ్ సలీమా రంజాన్ మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కుమారుడు బండి సాయి భగీరథ మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడి 48 గంటలు గడుస్తున్నా ఇప్పటివరకు తనపై ఎలాంటి చర్యలు తీసుకోకాపోవడం దుర్మార్గమైన చర్యని ఆమె



ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, హోం శాఖ మంత్రి వెంటనే బాధితులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన మాజీ చైర్మన్ గండు సైదులు హుజూర్నగర్ మార్కెట్ చైర్మన్ గువ్వల వీరన్న బిఆర్ఎస్ మండల నాయకులు షేక్ అలీ సురభి వీరబాబు శివప్రసాద్ పాల్గొన్నారు.

# దొరకుంటలో వైభవంగా శ్రీ గురుదత్త ప్రసన్న ఆంజనేయ స్వామి పూజలు

## సుగంధ నది జలాలతో స్వామివారికి అభిషేకం

## భక్తి పారవశ్యంలో భక్తులు.

## లోక కళ్యాణార్థం సంక్షేప రామాయణ, శ్రీరామ మూలమంత్ర హోమములు.

## వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి.

**కోదాడ రూరల్, మే 11( ప్రజాజ్యోతి):**

కోదాడ మండలం దొరకుంట గ్రామంలో వెలసిన శ్రీ గురుదత్త ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామివారిని



దర్శించుకున్నారు.?మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా శ్రీమాన్ వంగీపురం పవన్ కుమార్ ఆచార్యుల పర్యవేక్షణలో స్వామివారికి సుగంధ నది జల అభిషేకము మరియు మంగళ స్నానము శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ సంక్షేప రామాయణ హోమం, శ్రీరామ మూలమంత్ర హోమం, మరియు ఆంజనేయ మూలమంత్ర హోమములను వేద పండితులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు.?ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ,ఆధ్యాత్మిక



కార్యక్రమాల వల్ల గ్రామంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. హోమ కార్యక్రమాల అనంతరం స్వామివారికి విశేష నైవేద్యం, మంగళ హారతి సమర్పించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.?ఈ ఆధ్యాత్మిక క్రతువును పత్తిపాక కృష్ణ గురుస్వామి మరియు వారి బృందం దొరకుంట అత్యంత క్రమశిక్షణతో నిర్వహించారు. కార్యక్రమంలో కోదాడ డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి, దొరకుంట సర్పంచ్ పాలకి సురేష్, కౌన్సిలర్ కర్రీ సుబ్బారావు, గ్రామానికి చెందిన ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.



# మట్టి మాఫియా ఆగడాలు.. అధికారుల కళ్ల ముందే ఎర్రమట్టి దందా..!

**కొండమల్లేపల్లి, మే 11, (ప్రజా జ్యోతి):**

కొండమల్లేపల్లి మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తూ లక్షల్లో దందా సాగిస్తున్న మాఫియా గుట్టు తాజాగా పోలీసుల తనిఖీల్లో బయటపడింది.తేదీ 11-05-2026 రోజున కొండమల్లేపల్లి ఎస్సై అజ్మీర్ రమేష్ తన సిబ్బందితో కలిసి పెండ్లిపాకల ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ూ07ఖఖ7467 నంబరు గల టిప్పర్ వాహనం ఎర్రమట్టి లోడుతో వస్తుండగా అనుమానం వచ్చి ఆపి తనిఖీ చేశారు.తనిఖీల్లో ఆ టిప్పర్‌కు ఎటువంటి ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకపోవడం బయటపడింది. దీంతో డ్రైవర్ ఎదుల్ల వెంకటయ్య (తండ్రి కృష్ణయ్య, గ్రామం చింతకుంట్ల)ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే టిప్పర్ యజమాని విజయేందర్ రెడ్డి, గ్రామం కొండమల్లేపల్లి, ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తూ కొండమల్లేపల్లిలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు.ఈ ఘటనతో మండలంలో మట్టి మాఫియా వ్యవహారం మరోసారి వెలుగులోకి వచ్చింది. రాత్రి వేళల్లో చెరువులు, గుట్టలు, ప్రభుత్వ భూముల నుంచి ఎర్రమట్టిని అక్రమంగా తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంతమంది ప్రభావశీలుల అండతోనే ఈ దందా సాగుతోందని ప్రజలు మండిపడుతున్నారు.ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం కలిగిస్తూ, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ మట్టి మాఫియా యథేచ్ఛగా వ్యవహరిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.






ఇటీవల అక్రమ మట్టి రవాణా ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాలో మరెవరి ప్రమేయం ఉందనే కోణంలో కూడా విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

# స్వీయ గణన లో శర్బనాపురం 83% కంప్లీట్



**ఆలేరు మే 11 ప్రజ జ్యోతి**

ఆలేరు మండలం లో శర్బనాపురం గ్రామ పంచాయతీ ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరిగిన స్వీయ జనాభా గణన లో 170 కుటుంబాలకు కి గాను 142 కుటుంబాలు స్వీయ గణన చేసుకున్నారు అని ఎన్యూమరేటర్ ఎవీ శ్రీదేవి మేడమ్ తెలిపారు .మే 11 తేదీ నుండి జూన్ 9 వరకు జనాభా లెక్కల స్వీకరణ జరుగుతుంది అని చెప్పడం జరిగింది .సర్పంచ్ మొగలగని నర్సయ్య మాట్లాడుతూ నేటి నుండి జూన్ 9 వరకు జనాభా లెక్కల గణన జరుగుతుంది అందరు పాల్గొనాలి అని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొగలగని నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి కనకరాజు ,వార్డు సభ్యుడు కారే రాజు, కారే రమేష్, లక్ష్మీ తదితరులు పాల్గొనారు.

# వేసవిలో వడదెబ్బ తీసుకోవలసిన జాగ్రత్తల పై అవగాహన

**నూతనకల్.. మే 11 (ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని ఎర్రపహాడ్, పెదనెమిల గ్రామపంచాయతీలలో ఉన్న ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలలోని రైతులకు,హమాలి కూలీలకు,ఉపాధి హామీ కూలీలకు వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు ఉదయం11 గంటల లోపు సాయంత్రం 4 గంటల తరువాతనే పనికి వెళ్ళాలని సూచించారు.గర్భిణీలు, బాలింతలు,చిన్న పిల్లలు,60 సంవత్సరాల పైబడిన వారు, దీర్ఘకాలిక వ్యాదులతో బాధబడుతున్న వారు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.వడదెబ్బ లక్షణాలు చెమట పట్టక పోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం,వణకు పుట్టడం,మగతగా ఉండడం, ఫిట్స్ రావడం,పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్ళడం జరుగుతుందని తెలిపారు. తరుచుగా మంచినీళ్ల త్రాగడం, మజ్జిగ,నిమ్మ రసం,కొబ్బరి నీళ్లు, పల్ల రసాలు తీసుకోవాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో బయటికీ వెళితే, కాళ్ళకు చెప్పులు ధరించడం,టోపి,గొడుగు,తేలిక పాటి తెల్లని కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు.రోడ్ల పై దొరికే పానీయాలు తీసుకోకూడదని కోరారు.ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ, అంగన్వాడీ టీచర్లు,ఆశ కార్యకర్తలు,పోస్ట్ ఆఫీస్,ఫీల్డ్ అసిస్టెంట్లు,రేషన్ డీలర్స్ వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగిందని,అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యందు వైద్య సేవలు వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ చరణ్ నాయక్,ఎంఎల్ హెచ్ పి సుమాంజలి,హెచ్ ఏ లు కళావతి,వెంకన్న,ఏఎన్ఎం లు జయమ్మ,ఉమారాని,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జనగణన--2027 తొలి దశ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..

**మే 11 నుండి జూన్ 9 వరకు జనగణన కార్యక్రమం..**

**జనగణన కార్యక్రమానికి పట్టణ ప్రజలు పూర్తి సహకారం అందించాలి..**

**నల్లగొండ మున్సిపల్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర.**

**నల్గొండ మే 11,**

(ప్రజా జ్యోతి) : జనగణన 2027 తొలి దశ కార్యక్రమాన్ని



విజయవంతం చేయాలిన నల్లగొండ మున్సిపల్ కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్ర అన్నారు. "ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన" కార్యక్రమం నేటి నుండి నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఇండ్ల గుర్తింపు,



గృహాలకు క్రమ సంఖ్యలు కేటాయింపు, డోర్ నంబరింగ్, ఎన్యూమరేషన్ కార్యక్రమాలను ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర స్వయంగా 20, 21 ,22 డివిజన్ ప్రాంతాలలో జరుగుతున్న హెచ్.ఎల్.బి. డోర్ నంబరింగ్, ఎన్యూమరేషన్ పనులను పరిశీలించారు. ఫీల్డ్ స్థాయిలో జరుగుతున్న కార్యక్రమాలను సమీక్షించి, పనులు వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మే 11 నుండి జూన్ 9 వరకు నిర్వహించబడే జనగణన కార్యక్రమానికి పట్టణ ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఇంటింటికి వచ్చే ఎన్యూమరేటర్లకు సరైన, పూర్తి వివరాలను తప్పనిసరిగా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సర్వే ఆధారంగానే భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల రూపకల్పన, మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ఆరోగ్య సేవలు, విద్యా సదుపాయాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలు జరుగుతాయని తెలిపారు. అలాగే జనగణన కార్యక్రమం దేశ అభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని, ప్రతి కుటుంబం బాధ్యతగా సహకరించి,విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణవేణి, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్ అఫీఫ్ ఉర్ రెహ్మాన్, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి..

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

### ప్రతి వర్షపు నీటి చుక్కను సంరక్షించుకోవాలి..

### “జల్ సంచయ్ జన బాగిదారి” కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి..

### నీటి సంరక్షణ చర్యలపై ప్రజలలో అవగాహన కల్పించాలి..

### మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి.

**నల్గొండ కలెక్టరేట్ మే 11, (ప్రజా జ్యోతి):**

నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్రతి వర్షపు నీటి చుక్కను సంరక్షించుకోవాలని అన్నారు.“జల్ సంచయ్ జన బాగిదారి” కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ చర్యలపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఉద్దేశించి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని సోమవారం అయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తో కలిసి జండా ఊపి ప్రారంభించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జల సంరక్షణపై ప్రజలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు.ప్రజలలో ఈ విషయమై అవగాహన కల్పించేందుకు గాను ఏర్పాటు చేసిన ప్రచార వాహనం జిల్లాలోని అన్ని గ్రామాలను సందర్శిస్తుందని, తెలంగాణ సాంస్కృతి సారధి కళాకారుల ద్వారా నీటి సంరక్షణ, నీటి పొదుపు ,

ఉన్న నీటి వనరులను ఎలా వినియోగించుకోవాలో వాటికి సంబంధించిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం తో పాటు,నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా కమ్యూనిటీ సోక్ పిట్లు, వ్యక్తిగత సోక్ పిట్లు, నీటిని వృద్ధిపరిచేందుకు తోడ్పడే ఫామ్ పాండ్స్ ,నీటి సంరక్షణ కట్టడాలపై ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటి వనరులను సంరక్షించుకోవాలని, నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని, నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములై సహకరించాలని కోరారు. నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షపు నీటిని సంరక్షించుకోవడం చాలా ముఖ్యమని, నీటిని పొదుపుగా వాడుకుంటే వచ్చే తరాల వారికి నీటి కొరత లేకుండా చూడవచ్చని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, భావితరాలను దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇల్లు నిర్మించుకునే వారికి తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకునేలా చూస్తామని, నీటి సంరక్షణ చర్యలపై కార్పొరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, డిపిఆర్ఓ వెంకటేశ్వర్లు,స్థానిక కార్పొరేటర్ వున్న జ్ఞానేశ్వరి, కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్, డిఆర్డిఏ సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .









# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

## రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్టంలో త్వరలో చేపట్టే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లు ప్రతి ఇంటింటిని సందర్శించి వివరాలు సేకరించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలను ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రచారం చేయాలని, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారం తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించాలని, మ్యాపింగ్ ప్రక్రియపై వారి అనుమానాలను నివృత్తం చేయాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న ఫారం-6, 7, 8 లను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని, బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని, ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో మ్యాపింగ్ చేసుకునేలా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో స్పష్టమైన జాబితా రూపకల్పన చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, పాల్గొన్నారు.

# వరిగుంతం గ్రామంలో గ్రామసభకు సర్పంచ్ గైర్హాజరు....

## సర్పంచ్ వైఖరి పై వార్డు సభ్యులు ,గ్రామస్తుల ఆగ్రహం...

గ్రామ సర్పంచ్ ఒంటెద్దు పోకడలపై గ్రామస్థులు, వార్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన సోమవారం కొల్చారం మండలం వరిగుంతం లో జరిగింది. సోమవారం ఉదయం గ్రామసభ నిర్వహించనున్నట్లు సాటింపు వేయడం తో గ్రామస్తులు వార్డు సభ్యులు ఉపసర్పంచ్ వీరేశం తదితరులు హనుమాన్ మందిరం వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. అయినప్పటికీ సర్పంచ్ గ్రామంలోనే ఉండి గ్రామ సభకు రాలేదు. సర్పంచ్ గ్రామపంచాయతీ పనులు తన ఇష్టం ఉన్న పద్ధతిలో చేస్తున్నట్లు వార్డు సభ్యులు గ్రామసభలు ప్రజల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించడం పై సర్పంచ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గ్రామస్తులు, వార్డు సభ్యులు ఆరోపించారు. వెంటనే సర్పంచ్ తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో సమస్యల పరిష్కారం పై దృష్టి సారించాలని గ్రామాభివృద్ధి విషయంలో పంచాయతీ నిధుల ఖర్చుల విషయంలో వార్డు సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామస్తులు వార్డు సభ్యులు డిమాండ్ చేశారు.

# విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..

**ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం.**

**రూ.40.50 ల పీఎం శ్రీ పాఠశాల గదులు మరియు ల్యాబ్ ప్రారంభం..**

**కేజీవీబీ పాఠశాలలో రూ.38.50. కాంపౌండ్ వాల్, సెప్టిక్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన..**

**ఎంత ఎదిగిన విద్య మాత్రమే శాశ్వతం..**

**జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్.**



**నల్గొండ మే 11, (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 11 నుండి 17 వరకు నిర్వహిస్తున్న విద్యా వారోత్సవం సందర్భంగా సోమవారం ఆయన నల్గొండ జిల్లా,నకిరేకల్ నియోజకవర్గం, కట్టంగూర్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్



ఉన్నత పాఠశాలలో 40.50 లక్షల రూపాయల పీఎం శ్రీ పాఠశాల నిధుల ద్వారా నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను మరియు ల్యాబ్‌ను ప్రారంభించారు.అలాగే కేజీవీబీ పాఠశాలలో 38.50 లక్షల రూపాయలతో నిర్మించనున్న కాంపౌండ్ వాల్, సెప్టిక్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేశారు.ప్రభుత్వ విప్ వేముల వీరేశం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో దేశంలోనే గొప్ప మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలతో పాటు, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని ,ఒకే ప్రాంగణంలో 1650 మంది విద్యార్థులు చదివేలా అత్యాధునిక సౌకర్యాలతో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న,రాత్రి భోజనం, క్రీడా మైదానాలు, వసతి వంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం సంవత్సరానికి రూ.50 వేల వరకు ఖర్చు చేస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎంత ఎదిగినా విద్య మాత్రమే శాశ్వతంగా ఉంటుందని, విద్యార్థులు చదువుతో పాటు తమ ప్రతిభను పెంపొందించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నది, ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు డ్రాయింగ్, సింగింగ్, సెల్ఫ్ డిఫెన్స్, కంప్యూటర్ శిక్షణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆర్ట్స్ ఉ క్రాఫ్ట్స్, సైన్స్, క్రీడలు వంటి తమకు ఇష్టమైన అంశాల్లో శిక్షణ పొందాలని కోరారు. జిల్లాలోని కేజీవీబీలు, పీఎం శ్రీ పాఠశాలలు, జడ్పీ పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి అన్ని పాఠశాలలను మరింత మెరుగైన సౌకర్యాలతో సిద్ధం చేస్తామని తెలిపారు.

ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో నల్గొండ జిల్లా 98.47 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో పదో స్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ మండల



కేంద్రంలో జూనియర్ కళాశాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, తహసిల్దార్ పుష్పలత ,ఎంఈఓ అంజయ్య, ఎంపీడీవో జ్ఞాన ప్రకాష్ ,ఏఈ వెంకట నరసయ్య, సర్పంచ్ శ్యామల శేఖర్, మాజీ జెడ్పిటిసి మాదా యాదగిరి, ఉపాధ్యాయులు , తదితరులు పాల్గొన్నారు .

